గుండె సమస్యలపై 21న బాలలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 21న రాష్ట్రీయ బాల స్వస్య కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఇండో బ్రిటిష్ హాస్పిటల్ సౌజన్యంతో 0-18 ఏళ్ల వయసుగల పిల్లలకు ఉచితంగా గుండె వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు కాకినాడ జిజిహెచ్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ఎవరికైనా గుండె వ్యాధి ఉందని నిర్ధారణ అయితే వెంటనే ఇండో బ్రిటిష్ హాస్పిటల్ వారు ఉచితంగా వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తారన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

వ్యవసాయ కార్మికులకు పని కరువు

- అరకొరగానే ఉపాధి హామీ పనులు
- పస్తులతో కాలం వెళ్లదీస్తున్న వైనం
- ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో యంత్రాలపైనే ఆధార పడుతున్నారు. కూలీలకు అక్కడక్కడా మినహా పలు ప్రాంతాల్లో పనులు దొరకని దుస్థితి ఏర్పడింది. దీంతో పలువురు వ్యవసాయ కార్మికులకు పనులు లభించక అల్లాడుతున్నారు. వ్యవసాయ సీజనే అయినప్పటికీ పనులు లేక వస్తువులతో కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇటు ఉపాధి హామీ పథకం పనులు కూడా పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. దీంతో ఉపాధి కూలీల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. జిల్లాలో 2,88,489 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1,39,867 జాబ్ కార్డుదారులు రెగ్యులర్‌గా పనులకు వెళుతున్నారు. వీటి పరిధిలో 1.91 లక్షల వేతనదారులు ఉన్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున రూ.282 చెల్లిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం సరాసరి 8 వేల మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి అధికారులు పనులు కల్పించ లేకపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజన్ నడుస్తుంది. కాలవల్లో, చెరువుల్లో నీటి నిల్వలు ఉంటాయి. దీంతో సాధారణంగా ఖరీఫ్, రబీ పంట సీజన్లలో వ్యవసాయ పనులు ఉంటాయన్న కారణంతో అధికారులు ఉపాధి హామీ పథకం పనులు కల్పించలేకపోతున్నారు. మరోవైపు అదే సమయంలో ఒకవేళ ఉపాధి పథకం పనులు గనుక చెబితే వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడే అవకాశం ఉంటుందనే కారణంతో పనులు చెప్పలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు వేరేగా ఉన్నాయి. జిల్లాలో ఉన్న వ్యవసాయ కార్మికులకు సరిపడా పనులు ఎక్కడా లభించడం లేదు. ప్రతి చోటా యంత్రాల ప్రవేశంతో కోతలు, నూర్పిడి తదితర పనులన్నీ వేగంగా జరిగిపోతున్న కారణంగా అక్కడ కూలీల అవసరం ఉండడం లేదు. దీంతో వ్యవసాయ పనుల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సక్రమంగా అమలు కాని చట్టం

ఉపాధి చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలి. 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా వేతనాలు అందివ్వాలి. కనీస వేతనంగా రూ.300 ఇవ్వాలి. ఇలా చట్టంలో అనేక నిబంధనలు ఉన్నాయి కానీ జిల్లాలో ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం ఏమీ అమలు కావడం లేదు. ఉదాహరణకు వేతనాలను రెండు వారాలకు ఒకసారి ఇవ్వాల్సి ఉన్నా నెలలు తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. సరాసరి వేతనం రూ.250 ఎవరికీ రావడం లేదు. పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు ఉండడం లేదు. తాగునీరు ఇళ్ల వద్ద నుంచే తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉండడం లేదు. కూలీలకు పనిముట్ల సరఫరా ఎప్పటి నుంచో నిలిచిపోయింది. ఇలా అనేక లోపాలతో ఉపాధి పథకం అమలవుతుంది.

అరకొరగా 100 రోజుల పని దినాలు

మూడు నెలలుగా జిల్లాలో ఉపాధి పథకం నత్తనడకన సాగుతోంది. కూలీలకు పని కావాలని డిమాండ్ ఉన్నప్పటికీ పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాల్లో చేయాల్సిన పనులు అందుబాటులోనే వున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని తీరు వల్ల పనులు చేసే అవకాశం ఉండడం లేదు. రెగ్యులర్‌గా పనులకు వెళుతున్న ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని దినాలు కల్పించాలన్న లక్ష్యం నెరవేరడం కష్టంగా మారింది. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కేవలం 413 కుటుంబాలకు మాత్రమే ఇప్పటి వరకు 100 పని దినాలను కల్పించగలిగారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 12 వేల కుటుంబాలకు కల్పించాలని జిల్లా అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. ఈ లెక్కల ప్రకారం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 6 నెలల కాలంలో దాదాపు 6 వేలు కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంది. కానీ ఇంత వరకూ కేవలం 6 శాతం మాత్రమే లక్ష్యం చేరుకోగలిగారు. మిగిలిన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారో అధికారులకే తెలియాలి. ఒక పక్క పనులు లేకపోవడం మరోవైపు అప్పులు పుట్టక పస్తులతో కాలం వెళ్లదీస్తున్నామని ఉపాధి శ్రామికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులు, అటు వ్యవసాయ పనులు లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయం చూపాలని, బియ్యం, నిత్యావసరాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి

ప్రస్తుతం వ్యవసాయ పనులు సీజన్ కావడంతో అధికారులు ఉపాధి పనులు కల్పించలేకపో తున్నారు. అయితే యంత్రాల ప్రవేశంతో గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులకు పనులు ఉడడం లేదు. పస్తులతో ఉంటున్నారు. కావునా ఈ సమయంలో ప్రభుత్వం ఖచ్చితంగా ప్రత్యామ్నాయం చూపాలి.

- కెఎస్.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, ఎపి వ్య.కా.సంఘం

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం...

ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవు. ఉపాధి హామీ పథకంలో పనులు చూపడం లేదు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం తమ ఉపాధి కోసం పనులు చూపాలి. లేకుంటే కుటుంబ పోషణ మరింత భారంగా మారుతుంది.

- అడిగర్ల నాగ సత్యనారాయణ, ఉపాధి కూలీ, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

విద్య, వైద్య సాయానికి రెడ్ క్రాస్ కృషి

ప్రజాశక్తి-కాకినాడ

రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ప్రాంగణంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులకు రూ.55 వేల స్కాలర్‌షిప్, రెటీనా వ్యాధితో మాట్లాడుతున్న వ్యక్తికి రూ.25 వేల ఇంజక్షన్, రూ.50 వేల విలువ చేసే వినికిడి యంత్రాలు, స్వయం ఉపాధిలో భాగంగా ఒక మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. అమెరికాలో స్థిరపడిన రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి ఎం.శ్రీనివాసరెడ్డి ద్వారా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఎంతో మందికి అనేక రకాలుగా సేవ సహాయ కార్యక్రమాలు అందిస్తోందన్నారు. విద్యా వైద్యం స్వయం ఉపాధి వంటి వాటికి ఈ ట్రస్టు అధిక మొత్తాన్ని బహుకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ అధ్యక్షుడు డివిఆర్ జగన్నాథరావు, రెడ్నం రమణమూర్తి, చీమకుర్తి పాపారావు, రాయుడు సురేష్ కుమార్, లలిత్ కుమార్, డాక్టర్ శేషగిరి, వివి రామ్ చరణ్, అన్నపూర్ణ, శారద పాల్గొన్నారు.

చెక్కులు, కుట్టు మిషను అందజేసుతన్నత్న సభ్యులు

నష్ట పరిహారంలో మత్స్యకారులకు అన్యాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

మత్స్యకారులకు ఒఎన్జిసి నష్టపరిహారంలో కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. గాడిమొగ పంచాయతీ చినవలసలలో బుధవారం రచ్చబండ కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేలాదిమందికి 12 నెలలకు రావాల్సిన పరిహారం కేవలం 5 నెలల 14 రోజులకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. మరో ఆరు నెలలు పరిహారం రావాల్సి ఉండగా కంపెనీతో కూటమి నాయకులు లాలూచీపడి ఆ పరిహారం రాకుండా చేశారన్నారు. ఇటీవల గోదావరిలో ఒఎన్జిసి పైప్ లైన్ లీకేజీ వ్యవహారం పైన ఆయన కూటమి నాయకులను విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే మత్స్యకారులకు రావలసిన పరిహారాన్ని వడ్డీతో సహా కంపెనీ నుంచి వసూలు చేస్తామని తెలిపారు. పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని వైసిపి శ్రేణులపై కక్ష సాధింపులు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేయడంపై వైసిపి సిఇసి సభ్యులు పితాని బాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడారు. పేదవాడికి ఉచితంగా అందాల్సిన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అంకాడి అంజిబాబు, కొక్కిలిగడ్డ లోకేష్, రేకాడి నరసింహమూర్తి, పోతాబత్తుల నూకరాజు, కామేశ్వరరావు, వినకోటి రామకృష్ణ, నూకరాజు, పెట్ల సూర్యనారాయణ రాజు, కాదా గోవింద కుమార్, వెంటపల్లి నూకరాజు, రెడ్డి సతీష్, పందిరిపల్లి రాజేష్, పోతుల రత్నకుమారి, బల్ల సంధ్యారాణి, మోర్తా బీమాబాయి, కోరుకొండ కిరణ కుమారి, దడాల జగదీష్, మట్ట లింగమూర్తి పాల్గొన్నారు.

రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ సతీష్

రాజు కుటుంబానికి నష్టపరిహారం అందజేత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకడ రాజు కుటుంబానికి స్థానిక కూటమి నాయకులు రూ.5 లక్షల నష్టపరిహారాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు బొదిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు రాజుపై ఆధారపడి జీవిస్తున్నందున ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్య ప్రభ కృషితో తక్షణ సాయంగా రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ సాయాన్ని రాజు కుటుంబానికి అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎశ్రీకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, కోణాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, పెంద్ర శ్రీను, సామంతుల గోపి, సిహెచ్ కో చైర్మన్ జొన్నాడ వీరబాబు, అనంతారపు రాజు, కాకర వెంకట్రావు, శంకర్ ఉన్నారు.

సిబ్బందికి ఆదేశాలిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్

ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-కాకినాడ

నగరంలో పేరుకుపోయిన ఆస్తి పన్ను, కళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల మొండి బకాయిలను తక్షణం వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.టి. సుధాకర్ సూచించారు. బుధవారం స్మార్ట్ సిటీ సమావేశ హాల్లో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశానికి డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా కమిషనర్ సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో దాదాపు రూ.40 కోట్ల వరకూ మొండి బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వీటి వసూళ్లను వేగవంతం చేయడానికి గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులు తమ రోజువారీ పనులతో పాటు పన్ను వసూళ్లపై ప్రత్యేక దష్టి పెట్టి, రెవెన్యూ శాఖకు సహకరించాలని సూచించారు. పన్ను వసూళ్లలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదని, ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయడంలో అందరూ సమిష్టిగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిపిఆర్ఒ శైలజ, వాటర్ వర్క్స్ డి.లక్ష్మీనారాయణ, రెవెన్యూ అధికారి శిరీష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ

జిల్లాలోని పలుచోట్ల బుధవారం అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి నారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులను అన్ని విధాల ఆదుకుంటోందని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి, జిల్లా మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. రైతులకు 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. సూర్య ఫంక్షన్ హాల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి నారాయణ మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో భాగంగా 2వ విడత నిధులు రైతు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. అనంతరం రైతులకు రూ.99.88 కోట్ల చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎంపీ సానా సతీష్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, అందుగుల మణికుమారి, పైన్ని శ్రీనివాసరావు, అడబాల కుమారస్వామి, సరోజ వాసు, నూనె రామారావు, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

కాకినాడ కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో కలిసి భోజనం చేశారు. తహశీల్దారు జితేంద్ర, మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, బడేటి దేవి, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, నల్లూరి శ్రీనివాస్, మల్లాడి గంగాధరం, పురుషోత్తం, పల్లా సురేష్, నేమాని సత్యనారాయణ, మేడిశెట్టి బుజ్జి, జొన్నాడ వెంకటరమణ పాల్గొన్నారు.

గండేపల్లి మండలం మురారి గ్రామంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్ టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్ రావు అధ్యక్షతన చెక్కులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఎఎంసి చైర్మన్ అడపా భరత్, పుష్కర చైర్మన్ అడబాల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు కందుల కొండయ్య చౌదరి, కంటిపూడి సత్యనారాయణ, తోట రవి, ఆత్మ చైర్మన్ సూరిబాబు, యర్రంశెట్టి బాబ్జి. మురారి సొసైటీ అధ్యక్షుడు చావా తమ్మన్న చౌదరి, ఎంపిడిఒ కె.హరికష్ణ సత్యరెడ్డి, తహశీల్దారు ఆర్.శ్రీనివాస్, గండేపల్లి అగ్రికల్చర్ అధికారి జె.లక్ష్మి, కిర్లంపూడి గోకవరం అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సామర్లకోటలో చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ

ఐఎంఎ కాకినాడ అధ్యక్షునిగా వెంకటరమణ

ప్రజాశక్తి-కాకినాడ

కాదా వెంకటరమణ

రామకృష్ణ

ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ నూతన అధ్యక్షునిగా కాదా వెంకరమణ ఎన్నికయ్యారు. 2025-27కు సంబంధించి కాకినాడ శాఖ కమిటీకి స్థానిక రామ్ కోసాలో బుధవారం ఎన్నికల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఎలాంటి పోటీ లేకుండా అభ్యర్థు లందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. ఇందులో 2025-26 కాలానికి ఐఎంఎ కాకినాడ శాఖ అధ్యక్షులుగా డాక్టర్ కాదా వెంకటరమణ, సెక్రటరీగా రామకృష్ణ ఎన్నికయ్యారు. 2026-27 సంవత్సరానికి అధ్యక్షులుగా డాక్టర్ బి.విష్ణు మహేష్ బాబు ఎన్నికయ్యారు. మిగిలిన కార్యవర్గమంతా రెండేళ్లకు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.కృష్ణవేణి, డాక్టర్ ఎస్.వీరభద్ర రావు, డాక్టర్ త్రిమూర్తులు రాయుడు, గౌరవ కార్యదర్శి డాక్టర్ ఎస్‌సిహెచ్ఎస్ రావకృష్ణ, ట్రెజరర్‌గా డాక్టర్ ఎల్ఆర్ఎన్.నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ జిఎస్.మూర్తి, డాక్టర్ మోకా పవన్ కుమార్, డాక్టర్ చీట్ల కిరణ్ కుమార్ తెలిపారు.

పెద్దాపురంలో సంతకాలు సేకరిస్తున్న ఇన్‌ఛార్జి దొరబాబు

వైసిపి ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పెద్దాపురం

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకేరించడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సినిమా సెంటర్లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు మాట్లాడుతూ అట్టడుగు, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, చేనేత విభాగం ఇంచార్జి తూతిక సత్యనారాయణ, వైసిపి జిల్లా కార్యదర్శి ఆరేళ్ల వీరరాఘవ, యూత్ అధ్యక్షుడు కురుందాసు సతీష్ కుమార్, గుమ్మళ్ల ఉమా,తాడి కస్తూరి, బొబ్బిలి హరిబాబు, పప్పల దుర్గారావు, తాటికొండ పెదకాపు, ముమ్మన ప్రకాష్, లాలం సత్యనారాయణ, ముమ్మన శివ, బలుసు భీమరాజు, కంపర వీరభద్రరావు, బుర్రా పద్మరాజు, ఎర్రా రాంబాబు, పిన్నింటి రాము, మహమ్మద్ రఫీ, అడ్డూరి శ్రీనివాసరావు, వి.గంగ పాల్గొన్నారు. **గొల్లప్రోలు** బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ శివాలయం ప్రాంతాలలో 7, 8 వార్డులలో వైసిపి నాయకులు సంతకాలు సేకరించారు. గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, గంధం నాగేశ్వరరావు, ఈరుగుల యేసు, మైనం రాజా, గంట అప్పలస్వామి, దాసం పూసలు, తెడ్లపు చిన్న, బి.సత్తిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

పెద్దాపురంలోని ఆర్‌బి.కొత్తూరు, కట్టమూరు జెడ్‌పి హైస్కూల్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 బాయ్స్, గర్ల్స్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ఆర్ బి కొత్తూరు విద్యార్థులు పంపన వినయ్ (10వ తరగతి) హేమర్‌త్రోలో ప్రథమ స్థానం సాధించగా డిస్కస్‌త్రోలో తృతీయ స్థానం సాధించాడు. ఈసరపు రమణ (10వ తరగతి) హేమర్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడు. కట్టమూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని పి.శ్రీలక్ష్మి అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయింది. ఈ విద్యార్థులు ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని హెచ్‌ఎంలు ఎం.మీనా మాధురి, సత్యవాణి, ఉపాధ్యాయులు నిత్యానందం, కృష్ణమూర్తి, పీడీ కామిరెడ్డి సుబ్రహ్మణ్యం అభినందించారు.

సామర్లకోట రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు స్థానిక పిఎంశ్రీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామ కృష్ణ తెలిపారు. అండర్ 17 కేటగిరి కబడ్డీలో కె.అభిరామ్ ఎంపికకాగా, అండర్ 14 ఖోఖో బాలికల విభాగంలో జి.వర్షిణి, బాలుర విభాగంలో డి.గౌతం కుమార్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. విద్యార్థులను పీడీ పి.సుధారాణి, ఎస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్, హెచ్ఎం సాయిరామ్‌కృష్ణ అభినందించారు.

పెద్దాపురంలో ఆర్‌బి.కొత్తూరు విద్యార్థులు

ఘనంగా మహిళా దినోత్సవం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళా దినోత్సం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెద్దాపురం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉపాధ్యాయిని మిరియాల జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహారాణి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయశ్రీ, జ్యోతిర్మయి మాట్లాడుతూ సమాజంలో సగం మందిగా ఉన్న మహిళలు అందరూ విద్యను అభ్యసించడం ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ఆర్థిక అభివృద్ధి ద్వారా సమానత్వం సాధ్యమవుతుందన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలు రాణిస్తున్నారన్నారు. ఒకప్పుడు పురుషులకు మాత్రమే పరిమితం అనుకునే అనేక రంగాలలో నేడు స్త్రీలు ప్రవేశించి పేరు ప్రఖ్యాతులు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ పాఠశాల హెచ్‌ఎం పెంకే పద్మశ్రీ, ఉపాధ్యాయిని ఇవి.రవళి, గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో ఇందిరాగాంధీకి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కాకినాడ స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ డిటి సుబ్బలక్ష్మి, గొల్లపల్లి శ్రీలక్ష్మీ కుమారి, ఎం.సత్యబాల, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు, కె.కిషోర్, ఎం.శ్రావ్య, గేంద్ర కుమార్, ఫణీంద్ర కుమార్, టి.వీర్రాజు, జి.దుర్గా ప్రసాద్, వి.అరుణ, ఎస్.రాజు, టి.సాయి వెంకట్రావు పాల్గొన్నారు.

సామర్లకోట శాఖా గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బందిల రత్నామణి అధ్యక్షతన వైఎంహెచ్ స్కూల్ హెచ్‌ఎం ఎ.శ్రీదేవి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరప సమాజంలోని మహిళా సమానత్వానికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి పాట్నీడి వెంకట రంగయ్య ఆధ్వర్యంలో జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వేలంగి, కరప శాఖా గ్రంథాలయాలలో మహిళా సాధికారతపై చర్చా సభ నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఎర్ర విక్రం, మేడిశెట్టి పట్టాభి, కొండేపూడి రాంబాబు, పట్నాల సూరిబాబు, పన్నీర్ మన్నేరు రావు, చెక్క నూకరాజు, పట్నాల రాంప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ

అభయారణ్యంలో సిసిఎఫ్ తనిఖీలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి అభయారణ్యం, చొల్లంగి పర్యాటక కేంద్రం, అమలాపురం, భైరవపాలెం, హోప్ ఐలాండ్ ప్రాంతాల్లో అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతి ప్రియ పాండే బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ నిధులతో చేసిన పనుల నాణ్యతను, మడ అడవుల పెంపకానికి ఏర్పాటు చేసిన ఛానలింగ్‌ను పరిశీలించారు. చొల్లంగి పర్యాటక కేంద్రంలోని చెక్కల వంతెన, జెట్టి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిఠాపురంలోని నగరవాటికను ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిసిఎఫ్.మూర్తి, డిఎఫ్ఒ రామచంద్రరావు, ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్, ఎఫ్ఎస్ఒ సిద్ధార్థ, ఎఫ్‌బిఒలు మహేష్, ధనుంజయరావు, జగదీష్, పి.సంధ్యారాణి, సిహెచ్.ధనలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

140 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని వీరవల్లి టోల్ ప్లాజా వద్ద 140 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఐ రాంబాబుకు వచ్చిన ముందస్తు సమాచారంతో బుధవారం టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బొలెరో వాహనంలో ఫ్రూట్స్ ట్రేల మాటున రహస్యంగా దాచిపెట్టిన సుమారు 140 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని పాడేరు అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారని తెలిపారు. డ్రైవర్‌ను విచారిస్తున్నట్టు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధిస్తున్నారంటూ కాటవరం గ్రామానికి చెందిన కోసూరు లక్ష్మీప్రసన్న పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. 2020లో చాగల్లు మండలం చాగల్లు గ్రామానికి కోసూరి జగదీష్‌తో తనకు వివాహమైందని పేర్కొంది. కొంత కాలం కాపురం సజావుగానే జరిగిందని తెలిపింది. ఇటీవల తన భర్త జగదీష్, అత్త అమ్మాణి కలిసి అదరపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారని లక్ష్మీ ప్రసన్న ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో యాత్రికురాలి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కుండలేశ్వరం గ్రామంలో పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయం వద్ద అపశృతి చోటుచేసుకుంది. కార్తీక మాసం కావడంతో విశాఖపట్నం నుంచి ఆలయ దర్శనానికి వచ్చిన బొట్టా నిర్మల(67) గుండెపోటుకు గురై మరణించింది. నిర్మల స్వామివారిని దర్శించుకుని, అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆమె ఆకస్మికంగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలింది. వెంటనే అక్కడున్న యాత్రికులు, వైద్య సిబ్బంది సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది.

పేకాడుతున్న ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - యానాం

పేకాట శిబిరంపై యానాం పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. స్థానిక న్యూ జైల్ స్ట్రీట్ భాగ్యలక్ష్మి రైస్ మిల్లులోని ఒక షెడ్డులో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ పుణీత్ రాజ్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ-2 కట్టా సుబ్బరాజు తెలిపారు.

సిఎం రిలీఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురానికి చెందిన పుప్పాల దేవికి రూ.30,520 సిఎం సహాయ నిధి నుంచి చెక్కును పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు చల్లా బుజ్జి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాలకుర్తి శ్రీను బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బీమా

ప్రజాశక్తి-గండేపల్లి

మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల ఎస్‌బిఐ ఇన్సూరెన్స్‌ను అందజేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపారు. తుని రీజినల్ మేనేజర్ ప్రసాదరావు మాట్లాడుతూ మురారి గ్రామానికి చెందిన పాకలపాటి సత్యవతి ఏప్రిల్‌లో గండేపల్లి ఎస్‌బిఐలో ఎకౌంటు ఓపెన్ చేశారు. ఎకౌంటుతోపాటు రూ.500 బీమా చెల్లించారు. జూన్ 11న రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో రూ.10 లక్షల బీమా చెక్‌ను, సత్యవతి భర్త వీరబాబుకు బ్యాంక్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ సేల్స్ మేనేజర్ రాజశేఖర్, క్లస్టర్ సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, గండేపల్లి మేనేజర్ సురేఖ, పాల్గొన్నారు.

వేగంగా సాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు

వేగంగా షాపింగ్ కాంప్లెక్స్ పనులు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పంచాయతీ సహకారంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక పంపా వంతెన అవతల సుమారు రూ.కోటి వ్యయంతో మినీ ఆటోనగర్, చేపల మార్కెట్‌కు ఉపయోగపడేలా 60 షాపులతో కూడిన కాంప్లెక్స్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి బుధవారం సర్పంచ్, వార్డు సభ్యులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో షాపుల సముదాయానికి స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయం పూర్తయితే పంచాయతీకి ఆదాయ వనరులు పెరగడంతోపాటు ప్రస్తుతం గ్రామంలో పెద్ద రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న చేపల మార్కెట్ తో ప్రతినిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ అంతరాయానికి విముక్తి కలుగుతుందని సర్పంచ్ ఎస్ కుమార్ రాజా తెలిపారు.

వైద్యుల సూచన మేరకే వాడాలి

ప్రజాశక్తి-కాకినాడ

యాంటీబయోటిక్స్‌ను వైద్యుల సూచన మేరకే వాడాలని కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి సూచించారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా బుధవారం హాస్పిటల్ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీకి జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి నేతృత్వం వహించారు. ఎమ్మార్ పెరుగుతున్న నేపథ్యంలో యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా, వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలని ఆమె ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ కోమల, మైక్రోబయాలజీ హెచ్ఒడి డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

యానాం వార్తలు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ రాజు, చీకట్ల రామకృష్ణ

కాంగ్రెస్ పార్టీకి పలువురి రాజీనామా

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ నాయకులు తీరును నిరశిస్తూ యానాంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకపాటి ప్రసాద్ రాజు, చీకట్ల రామకష్ణ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల యానాం బ్లాక్ కాంగ్రెస్ కమిటీని వేశారని, తమను అసలు సంప్రదించలేదని తెలిపారు.కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని, పార్టీలో పనిచేసే సీనియర్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో యానాంలో ఇంటింటా ప్రచారం చేసి పార్టీకి ఏడు వేలకు పైగా ఓట్లు రావడానికి కృషి చేసినా విలువ లేదన్నారు. కర్నీడి సత్యనారాయణ, గిడ్ల బాలయోగి, మెల్లం వెంకటేశ్వరరావు, బండారు పల్లం రాజు పార్టీకి రాజీనామా చేశారు.

ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరాగాంధీకి నివాళి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి బుధవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి, జిప్‌మెర్ ఆసుపత్రి సమీపంలో యానాం బైపాస్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహాలకు ఆర్ఎఒ అంకిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జున రావు, ఎస్‌పి వరదరాజన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగ్గు వేస్తున్న యువతి

మహిళలకు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న ప్రపంచ మత్స్యకారులు దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు బుధవారం నిర్వహించారు. ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో పాల్గొని మత్స్యకారుల జీవన విధానంపై రంగురంగుల ముగ్గులతో తమ ప్రతిభను ప్రదర్శించారు. మ్యూజికల్ చైర్ పోటీల్లోనూ పోటీపడి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమంగా నిలిచినవారికి శుక్రవారం వేడుకల్లో బహుమతులు అందజేస్తామని అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతియ్య తెలిపారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న రవికుమార్ ఓదూరి కిషోర్

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో చేయూత సంస్థ నిరుపేద కుటుంబానికి సాయం అందించింది. చేయూత సంస్థ వ్యవస్థాపకులు రవికుమార్ వికలాంగ నిరుపేద కుటుంబానికి రూ.10 వేలు, నిత్యావసరాలు అందజేశారు. కుటుంబంలో చిన్నారి విద్యా బాధ్యత తీసుకున్నారు. మండలం భవిత కేంద్రానికి స్పీచ్ ట్రైనర్ మిషన్ అందజేశారు. ఇటీవల ప్రసవ సమయంలో తల్లిని కోల్పోయిన చిన్నారికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఓదూరి కిషోర్, జనసేన పార్టీ సభ్యులు అల్లం దొరబాబు, జయసూర్య హేచరిస్ అధినేత మురళీ మోహన్, గాజుల గోవింద్, లోకరెడ్డి స్వామి, పోసిన రవి, కందా కామరాజు, సాయి, తలాటం లోవబాబు, కరి సింహాద్రి అప్పన్న పాల్గొన్నారు

భీమేశ్వరాలయంలో కేంద్ర మంత్రి సతీమణి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం కేంద్ర పరిశ్రమలు ఉక్కు శాఖ మంత్రివర్యులు భూపతిరాజు సతీమణి వెంకటేశ్వరీదేవి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆమె ఆలయ ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కంటే జగదీష్ మోహనరావు (బాబు) పాల్గొన్నారు.

పరిశ్రమను సందర్శించిన ఆదిత్య విద్యార్థులు

ఆదిత్య విద్యార్థుల ఫార్మసీ పరిశ్రమ సందర్శన

ప్రజాశక్తి గండేపల్లి

సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థుల పాఠ్య కార్యక్రమంలో భాగంగా ఎపి మెడ్‌టెక్ జోన్‌కు విశాఖపట్నం పరిశ్రమ సందర్శన జరిపినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 82 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశ్రమ వాతావరణాన్ని, ముఖ్యంగా మెడికల్ డివైస్ తయారీ ప్రక్రియలను, బయోమెడికల్ పరికరాల ఉత్పత్తి విధానాలు, అనిమల్ హౌస్ కార్యకలాపాలు ప్రత్యక్షంగా అవలోకనం చేయడం ద్వారా విద్యార్థులు అమూల్యమైన ప్రాక్టికల్ అనుభవాన్ని పొందారు.

పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-గొల్లప్రోలు

డ్రైనేజీల్లో చెత్త వేయకుండా తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించాలని కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ పనులను కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. రోడ్డుకిరువైపులా ఉన్న గడ్డిని తొలగించి డ్రైన్లు పూడిక తీసి రోడ్లు, డ్రైనేజీల్లో చెత్తను తొలగించారు. డ్రైనేజీలో చెత్తవేయకుండా ఇంటి నుంచి సేకరించే చెత్తను తడి పొడి హానికరమైన చెత్తను విభజన చేసి మున్సిపల్ కార్మికులకు అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రఘు ప్రసాద్ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మన పెద్దాపురం ఫేస్బుక్ బందం నిర్వహిస్తున్న మాతత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ఫేస్బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రతి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు, వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు దాతల సాయంతో పౌష్టికాహార పదార్థాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు నిమ్మలగడ్డ సూర్య ప్రదీప్, రవళి దంపతుల కుమార్తెలు శర్య గిరి, శక్తి సాయంతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ నాని, ఆనంద్, వడ్డి సత్యనారాయణ, రాఘవులు, సతీష్, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, కె.లక్ష్మి, రత్నం తదితరులు సేవలందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మృతుల కుటుంబాలను పరామర్శించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

కిర్లంపూడి మండలం సోమవరం యాక్సిడెంట్‌లో మరణించిన బాధిత కుటుంబ సభ్యులను ఎస్‌సి కమిషన్ చైర్మన్ వెంటనే పరామర్శించాలని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివ గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇన్సెంటివ్, ఎక్స్‌గ్రేషియా, ఎస్‌సి కార్పొరేషన్ సహకారం ఏ విధంగా అందించారో వారిని అడిగి తెలుసుకున్నారు. కొమ్ముకూరి శ్రీను, రాజేష్, జాయింట్ సెక్రెటరీ పండు, మార్తా తాతారావు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను ఉద్యోగాల్లో పెట్టుకోవద్దు

ప్రజాశక్తి - జగ్గంపేట

అపరిచిత వ్యక్తులను ఉద్యోగాల్లో పెట్టుకోవద్దని పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు బుధవారం పోలీసులు నోటీసులు ఇచ్చారు. నేరాలను అదుపు చేసేందుకు పోలీసులు వ్యాపార సంస్థలను, గృహ యజమానులను అప్రమత్తం చేశారు. కొత్త వ్యక్తులను ఉద్యోగాల్లో పెట్టుకోవద్దని, తెలియని వ్యక్తులకు గృహాలు అద్దెకు ఇవ్వద్దని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఎస్ఐ కె.సతీష్ సూచించారు.

పిఎం స్వనిధి రుణాల చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పెద్దాపురం

పట్టణ పరిధిలోని 54 మంది మహిళలకు మంజూరైన స్వనిధి చెక్కులను బుధవారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద పంపిణీ చేశారు. స్థానిక యూనియన్ బ్యాంకు కార్యాలయంలో మెప్మా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ మాట్లాడుతూ 41 మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు, 13 మందికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున యూనియన్ బ్యాంకు రుణాలు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ సాయినాథ్, మెప్మా సిఒలు శ్రీదేవి, నర్గీస్, ఆర్‌పిలు మహిళలు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

సిసి రోడ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని గుత్తేదారులకు ఎంపిడిఒ ఎ.రాజు ఆదేశం చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డును స్థానిక నేత సాలి సత్య నారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానిక ఎస్‌సి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.50 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా నిర్మాణ నాణ్యతను, వాడుతున్న మెటీరియల్స్‌ను ఆయన పరిశీలించి గుత్తేదారుకు పలు సలహాలు సూచనలు అందజేశారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

పల్లంకుర్రులో వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రభుత్వం నిర్వహించాలని తలపెట్టిన కార్యక్రమానికి నిరసనగా వైసిపి కో-ఆర్డినేటర్, మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పల్లంకూరు మాజీ సర్పంచ్ నాతి సత్యనారాయణ ఇంటి వద్ద బుధవారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ నిర్వహించారు. అనంతరం వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా నాతి సత్య నారాయణను ఎన్నుకున్నారు. కార్యక్రమ ంలో మండల వైసిపి కన్వీనర్ నల్ల నరసింహ మూర్తి, ఎంపిపి కోలాటి సత్యవతి సత్యం, జడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్, నగర పంచాయతీ చైర్మన్ కమిటీ ప్రవీణ్ కుమార్, పితాని బాలకృష్ణ, కాశి ముని కుమారి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని బహిరంగ మల విసర్జన చేయరాదు అంటూ ఎంపిడిఒ వెంకటాచలం పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఐకెపి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కాట్రేనికోన మండల సమైక్య కార్యాలయం నుంచి గేట్ సెంటర్ వరకు 90 మంది మహిళలతో ఈ ర్యాలీ నిర్వహించారు.

మహారాజశ్రీ తుని అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.170/2019
గంజవరపు పద్మారావు ...పిటీషనరు/వాది
మరియు
కోరుమిల్లి శ్రీను @ రమణ ...రెస్పాండెంటు/ ప్రతివాది
To
కోరుమిల్లి శ్రీను @ రమణ S/o నాగులు, వ.51 సం.లు., హిందు, ధోబి, D.No.1-192, పాత కొట్టాం, కోటనందూరు మండలం, తుని కోర్ట్ లిమిట్స్.
పై నెంబరు దావాలో మీరు రెస్పాండెంటు/ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు నోటీసులు పంపినప్పటికిన్ని మీరు కావాలని తీసుకొనియుండలేదు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని, పై కోర్టు వారి ఎదుట తేది.28-11-2025 వ తేదీన ఉదయం 10.30లకు హాజరై మీ అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేని యడల మీ పరోక్షమున తీర్మానము చేయుబడును.
ఇట్లు
శ్రీయాళ్ళ బదరీ నారాయణ మూర్తి
అడ్వకేట్,
తేదీ : 17/11/2025 తుని

IN THE COURT OF THE VI ADDITIONAL DISTRICT JUDGE, KAKINADA(MACT)
M.V.O.P.No.2/2024
Between:-
Smt.Rotta Dalamma and Others ...Petitioners
And
Edurumilli Lokesh & Others ...Respondents
To.
R1. Edurumilli Lokesh S/o. (Late) Balaji swami, (Rider of the Vihicle) aged 17years, Parlopeta, Kakinada.
R2. Kona Haribabu S/o. Chinna Verikanna, (Owner of the Vehicle) R/o. 4-72/1, Venugopala Swami Temple, Alluri Sitaramaraju Statue, Kajuluru Mandal.
పై నెంబరు పిటిషన్‌లో 1వ మరియు 2వ రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.04-12-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
రమణమ్మ లా ఛాంబర్స్ & ఛార్టీస్
గౌరుసు రాజకిర్తి
అడ్వకేట్, కాకినాడ
సెల్.9703869199

దస్తావేజులు పడిపోయినవి
జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన పైల నాగమణి భర్త దేవుడు అను నాకు జె.కొత్తూరు పంచాయితీ పరిధిలోని రెవెన్యు పరిధి తిరుపతిరాజుపేటలోని సర్వేనెంబరు 36/2c లో 1.00సెంట్లు భూమికి సంబంధించి దస్తావేజు నంబర్ 910/1986 తేదీ 05-05-1986 కలిగిన ఒరిజినల్ దస్తావేజులు తీసుకుని 17-11-2025న రాజపూడి నుండి జగ్గంపేట జిరాక్స్ షాపుకు వెళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినను దొరికియుండలేదు. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
పైల నాగమణి భర్త లోవరాజు
రాజపూడి జగ్గంపేట మండలం
సెల్.8978268722

అడ్డుకొండ భూమి పేదలకే దక్కాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల, గండేపల్లి మండలంలోని కె.గోపాలపురం గ్రామాల మధ్య నున్న అడ్డుకొండ భూమి పేదలకే దక్కాలని ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మల్లిశాల వద్ద అడ్డుకొండ భూమి సాగు రైతులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ 583 ఎకరాల అడ్డుకొండ భూమిని రెండు గ్రామాల నిరుపేద ప్రజలకే పంచి పెట్టాలన్నారు. కడితి సతీష్, బోడకుర్తి అబ్బులు, అప్పారావు, అన్నవరం, ముత్తా చంద్రరావు, చింతల కృష్ణ పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు పెదపూడి విద్యార్థులు

ప్రజాశక్తి-పెదపూడి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన కబడ్డీ సెలక్షన్స్ లో పెదపూడి గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. కె.రితిక, సత్యసాయి, ఎస్.నవ్య, ఎల్.రామ వీరదుర్గా శివ అండర్ 14కబడ్డీ విభాగములో ఎంపికైన విద్యార్థులు త్వరలో మచిలీపట్నంలో జరిగే క్రీడలలో రాష్ట్ర స్థాయి పోటీలు జిల్లా తరపున పోటీ పడతారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు భోగిళ్ల మురళీ కుమార్ తెలిపారు.

Lost Passport
Iam Muthabathula Jyothi, W/o Nagaraju, Residing at D.No.1-96, NANDAMPUDI (V) Ambajipeta Mandal, I was Lost my Pasport in the Travelling from House to Xerox Center Pasport No. X0674491, I Request you the my Passport
Muthabathula Jyothi
W/o Nagaraju, Residing at D.No.1-96, NANDAMPUDI (V)
Ambajipeta Mandal,
Dr. B.R.A. Konaseema Dist. A.P.
Cell: 8897798604

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి సన్నిధికి
IANo.441/2024, ASNo.59/2018
Between:-
పెనుమాల అనన్య గీత ...పిటిషనరు/అప్పిలెంటు
మరియు
పెనుమాల కోటేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు
R4. పెనుమాల రవితేజ S/o. ప్రసన్నకుమార్, హిందువు, ఉద్యోగం, వయస్సు.23సం॥లు, డోర్‌నెం.2-107, A,B నగర్, బండార్లంక, అమలాపురంమండలం, Dr.B.R.A.కోనసీమజిల్లా.
R5. పెనుమాల నీరజ్ S/o. ప్రసన్నకుమార్, వయస్సు 20సం॥లు, -do- -do-
ఈ నెంబరులో 4,5,రెస్పాండెంట్లుకు నోటీసులు అమలు నిమిత్తం శ్రీ కోర్టు వారు ద్వారాను,పోస్టల్ ద్వారాను పలు పర్యాయములు పంపించగా అమలు జరగనందున సదరు 4,5 రెస్పాండెంట్లుకు నోటీసులు అమలు నిమిత్తం ది.03-12-2025 తేదిని శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10.30ని॥లకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
అడపా వెంకట సత్యప్రసాద్
అమలాపురం అడ్వకేట్, అమలాపురం
ది.18-11-2025 సెల్.9666776789

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
OP.No.330/2024
Between:-
సరెళ్ళ రాజశేఖర్ ...పిటిషనర్
మరియు
సరెళ్ళ(చోడే) సాయిలక్ష్మి @ షెబా మరియు ఒకరు ...రెస్పాండెంట్స్
To.
R1. సరెళ్ళ(చోడే) సాయిలక్ష్మి @ షెబా W/o. రాజశేఖర్ R/o.D/o.చోడే బాస్కర్ రావు, ఉండ్రాజవరం, గ్రామం మరియు మండలం, తూ॥గో॥జిల్లా.
పై నెంబరు కేసులో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.28-11-2025వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం గం॥10.30ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలియపరచవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది. 28-11-2025
(శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం)
శ్రీ నందెపు చిన వెంకటేశ్వరరావు
శ్రీ కుంచె శ్రీనివాసరావు
అమలాపురం అడ్వకేట్స్, అమలాపురం
ది.19-11-2025 సెల్.9885464893

Before The VIII Addl. Motor Accidents Claims Tribunal : Nellore
M.V.O.P.No. 531 / 2024
1. Bandi Jayalakshmi
2. Bandi Sreenija - Claimants
Versus
Sagi Veera Venkata Satya Subramanya Varma - Respondent
Notice
To,
Sagi Veera Venkata Satya Subramanya Varma, S/o Sagi P.V.S.S. Owner of the Car bearing No. AP-05-DB-9999, Resident of 9-1622, Prathipadu, Prathipadu Mandal, East Godavari, Kakinada.
పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే12-12-2025ది కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వేనాటి చంద్రశేఖర రెడ్డి, బి.ఎ., బి.ఎల్., క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

గ్రామసభలో పాల్గొన్న ఆర్‌డి శ్రీరమణి

ఎస్.పైడిపాలలో గ్రామసభ

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలో నల్లరాతి క్వారీ తవ్వకాలకు సంబంధించి బుధవారం ఆర్‌డిఒమ శ్రీరమణి ప్రజాఅభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఎస్.పైడిపాల ప్రజలకు తాగునీరు, వైద్యానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సంస్థ నిర్వాహకులు హామీ ఇచ్చారు. భారీ లారీల రవాణా ఇబ్బందులు పడుతున్నామని వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రౌతులపూడి మండల అభివృద్ధికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

In the Court of Civil Judge (Senior Division) Prl. Senior Civil Judge, Eluru, Eluru Dist.
O.S.126/2018
Between:
Vegunta Satya Vani (Died) and Others ...Plaintiffs
And
Kanniganti Vishnu Priya Devi etc ...Defendants
పై నెంబరు దావా గ్రంథంలో పార్టీషను దావాలో 8వ ప్రతివాదియైన మిక్కిలినేని శ్రీనివాస చక్రవర్తి S/o.Late లక్ష్మణరావు, డోరునెం.9-12-31, Flat F3, Vasista Enclave, Amarwades Gardens, Ramanayyapeta, Sarapavaram Junction, Kakinada, E.G.Dist. అనువార్కి తమ కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం అనేక పర్యాయములు సమన్లు పంపియున్నను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున 8వ ప్రతివాది సదరు దావాలో కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పేపరు ద్వారా సమన్లు చేయుటకు ఆర్డరు వేసినారు. కావున ది.4-12-25వ తేది ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా కాని ప్లీడరు గారి ద్వారా కాని హాజరుకాగలరు. లేనియెడల దావా గ్రంథంలో మీ పరోక్షమందు విచారించబడును.
వై.నిర్మలా దేవి
ఏలూరు వాది తరపు అడ్వకేట్,
తేది.10-11-25 ఏలూరు.

IN THE COURT OF THE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT:: HYDERABAD
O.S.No. 249 of 2021
Between:
M/s.Sree Jayajothi Cements Private Limited ...Plaintiff.
AND
M/s. Sri Lakshmi Narasimha Infra's & anr. ...Defendants.
To
1. M/s. Sri Lakshmi Narasimha Infra's, Rep. by its Managing Partner Mr.P.Srinivasa Raju,
2. Mr.P.Srinivasa Raju S/o not known to Plaintiff, Managing Partner of M/s.Sri Lakshmi Narasimha Infra's, Both at: 4-73, Madhura Nagar, Kakinada, East Godavari District, Andhra Pradesh-533004 ...Defendants.
Please take notice that the Plaintiff herein has filed the above suit for recovery of the suit amount and the matter stands posted to 12-12-2025 for your appearance. You are, therefore hereby directed to appear before this Hon'ble Court on the above date either in person or through your Counsel at 10:30 A.M and take necessary stand, failing which the matter will be decided in your absence as per law.
// BY ORDER OF THE HON"BLE COURT//
P. KISHORE KUMAR
P.SRINIVASA KUMARI
Advocates
Flat No.202, Suseela Sadan, Anandnagar Colony, Khairatabad, Hyderabad-500004.
Cell No: 9440040799

మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
IPNo.24/2025
Between:-
దంగేటి శ్రీ కృష్ణ ...పిటీషనరు
మరియు
గూటం సత్యనారాయణ అండ్ అదర్స్ ...రెస్పాండెంట్లు
టు.
1. గూటం సత్యనారాయణ తండ్రి తాతారావు, డోర్‌నెం.2-63, బీరవారి పేట, మొగళ్ళమూరు విలేజ్, అల్లవరం మండలం
2. గూటం మంగాదేవి తండ్రి పోతుల కిరణ్ కుమార్, డోర్‌నెం.2-63,మొగళ్ళమూరు విలేజ్, అల్లవరం మండలం.
ది.01-08-2025 సం॥తేదిన 1వ రెస్పాండెంటు, 2వ రెస్పాండెంటు పేర వ్రాయించిన పిటిషను షెడ్యూలు క్రయ దస్తావేజు Annul అని, 1వ రెస్పాండెంటుని ఇన్‌సాల్వెంటుగా ప్రకటించమని కోరుచు, పిటిషను షెడ్యూలు ఆస్తికి రిసివర్‌ని నియమించి ఛార్జి చేయవలసినదిగాను పిటిషనరు అండర్ సెక్షన్ 9(2) మరియు 10(3) ఆఫ్ ప్రొవిన్సియల్ ఇన్‌సాల్వెన్సి యాక్టు క్రింద పైన తెలిపిన వారి కోర్టులో పిటిషను దాఖలు చేసినారు. ది.01-12-2025 తేదీన ఉదయం గం॥10.30 ని॥లకు రెస్పాండెంట్లు కోర్టులో హాజరు అయి ఆక్షేపణలున్న యెడల తెలియపరచు కొనవలెను. యితరులు ఎవరికైనను అభ్యంతరములున్న ఎడల హాజరు అయి తెలియపరచుకొనవలెను.
షెడ్యూలు
డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా (ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా) అల్లవరం సబ్‌రిజిస్ట్రరీ, అల్లవరం మండలం దేవగుప్తం గ్రామం జి.పల్లం భూమి రి.స.నెం.732 పూరా య.14-78 సెంట్లు ఉత్తరం వైపు 0-42 1/2 సెంట్లు హద్దులు
తూర్పు:- నామన నాగేశ్వరరావు భూమి
దక్షిణం:- పంటకాల్వ ఇరిగేషన్ కెనాల్
పడమర:- యీ నెంబరు భూమి
ఉత్తరం:- బీర సావిత్రి భూమి
నల్లా ప్రభాకర్
నల్లా సురేష్
అమలాపురం పిటిషనరు తరపు న్యాయవాదులు
ది.17-11-2025 అమలాపురం